క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఉదయగిరి శివాలయంలో ప్రత్యేకాలంకరణలో శివయ్య

ఉదయగిరి: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయగిరి పట్టణంతో పాటు మండలంలోని గండిపాళెం, గుడినరవ శివాలయాల్లో అర్చకులు స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తహసీల్దార్‌గా ట్రైనీ కలెక్టర్



మర్రిపాడు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): కలెక్టర్ హరి నారాయణన్ సూచనల మేరకు మర్రిపాడు తహసీల్దార్‌గా ట్రైనీ కలెక్టర్ సంజన సిన్హా సోమవారం ఇన్‌చార్జి తహసీల్దారు ఆనందరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. గ్రామీణ స్థాయిలో భూ సమస్యలు, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, సర్వే విభాగం సమస్యలు తదితర అంశాలపై శిక్షణ పొందడంతో పాటు క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖాపరమైన అంశాలు అవగాహన పెంచుకునేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. సెప్టెంబరు నెలాఖరు వరకు తాను ఈ బాధ్యతల్లో కొనసాగుతానన్నారు.

సత్తా చాటిన కావలి విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నగళ్ల శ్రీనివాసకిరణ్

కావలి: విక్రమ సింహపురి యూనివర్సిటీ డిగ్రీ ఫలితాల్లో కావలిలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థినిలు మ్యాథ్స్, ఎలక్ట్రానిక్స్, బొటనీ, కెమిస్ట్రీ, జువాలజీ, స్టాటిక్స్ తదితర సబ్జెక్ట్‌ల్లో 40 మంది విద్యార్థినులు నూటికి నూరు శాతం మార్కులు సాధించి సత్తా చాటారు. వారిని సోమవారం కళాశాల అధ్యాపక బృందం అభినందించింది. ఆవుల నిహారిక 9.92 జీపీఏతో పాటు మరో 13 మంది విద్యార్థినులు 9పై జీపీఏ సాధించారు. ప్రిన్సిపల్ నగళ్ల శ్రీనివాసకిరణ్, అధ్యాపకులు, అధ్యాపకేతరులు విద్యార్థినులను అభినందించారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

సంగం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. సంగం తిరుమనతిప్పకు వెళ్లే ప్రాంతంలో సంగం గ్రామానికి చెందిన తిరుపాలు అనే వ్యక్తి తన నివాసంలో అక్రమం మద్యం విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి సోమవారం మద్యం విక్రయిస్తున్న నివాసంపై దాడులు చేసి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, తిరుపాలును అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మెకానిక్ దేవకుమార్ మృతదేహం

కావలి: రిపేర్‌కు ఇచ్చిన బైక్ బాగా చేయలేదని కొట్టి.. ఎందుకురా నువ్వు బతికేది అన్నారని మనస్తాపం చెందిన ఓ బైక్ మెకానిక్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి బుడమగుంట ఎస్సీ కాలనీలో జరిగింది. కావలి రూరల్ ఎస్సై శెట్టిపల్లి సుమన్ కథనం మేరకు.. బుడమగుంట ఎస్సీ కాలనీకి చెందిన దావులూరి దేవకుమార్ (21) తన ఇంటి వద్దనే బైక్ మెకానిక్ పనులు చేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన గుండాబత్తిన సల్మాన్ బైక్‌ను రెండు నెలల క్రితం మెకానిక్ దేవకుమార్ రిపేరు చేశాడు. ఆదివారం సాయంత్రం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న గుండాబత్తిన సల్మాన్, రవి, నవీన్, దుర్గాబాబు బైక్ బాగా చేయలేదని మెకానిక్ దేవకుమార్‌తో వివాదానికి దిగి కాళ్లు, చేతులతో కొట్టారు. ఎందుకురా ఈ బతుకు బతికేది చావరా అంటూ దుర్భాషలాడారు. దీంతో దేవకుమార్ తీవ్ర మనస్తాపానికి గురై తన పాత ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకొన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమవారం ఉదయం మృతుడు తండ్రి మాలకొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

తీరని టీడీపీ భూదాహం

తెలుగు తమ్ముళ్ల భూ దాహం.. కావలి నియోజకవర్గానికి శాపంగా మారింది.

దాదాపు తొమ్మిదేళ్లుగా మానని గాయంగా మిగిలింది. జిల్లాకే తలమానికం కావాల్సిన దామవరం ఎయిర్‌పోర్టు టీడీపీ నేతల భూదందా కారణంగా త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతోంది. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని సాగించిన భూ అరాచకానికి రెవెన్యూ ఉద్యోగులు కొలువులు పోగొట్టుకుని రోడ్డు పాలయ్యారు. కోర్టు కేసులు విమానాశ్రయానికి అడ్డంకిగా మారింది.



నిరుపయోగంగా ఉన్న ఎయిర్‌పోర్టు భూములు

- వందల ఎకరాల భూముల దోపిడీ
- త్రిశంకు స్వర్గంలో దామవరం ఎయిర్‌పోర్టు
- ఐదుగురు తహసీల్దార్లు, ఇద్దరు వీఆర్వోలు బలి
- ఇప్పటికీ కోర్టు వ్యాజ్యాలతో పరిష్కారం కాని వైనం

కావలి: కావలి నియోజకవర్గంలో టీడీపీ అంటే.. 'తమ్ముళ్ల దోపిడీ పార్టీ'గా అవతరించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రెండేళ్ల కరోనా కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. తర్వాత రెండేళ్లలో ఓ వైపు రామాయపట్నం, మరో వైపు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు వేగం పుంజుకుని ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. పరిస్థితులు అనుకూలించి ఉంటే దామవరం ఎయిర్‌పోర్టు కూడా ఇప్పటికే ఒక దశకు చేరుకునేది. గతంలో ఐదేళ్ల అధికారంలో ఉండి వీటి అభివృద్ధిని విస్మరించిన టీడీపీ నేతలు.. ఇప్పుడు అభివృద్ధి జరగలేదంటూ నంగనాచి విమర్శలు చేస్తున్నారు. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండలం దామవరం, కొత్తపల్లి కొరుగుంట పరిసరాల్లో టీడీపీ నేతలు సాగించిన భూ దందాకు అభివృద్ధి పడకేస్తే.. రెవెన్యూ అధికారులు ఉద్యోగులు పోగొట్టుకుని రోడ్డున పడ్డారు. ఇదే టీడీపీ ఐదేళ్లలో సాధించిన అభివృద్ధి.

జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన విమానాశ్రయాన్ని కావలి నియోజకవర్గంలో నిర్మించేందుకు జరుగుతున్న సన్నాహాల్లో అప్పటి అధికార టీడీపీ నాయకుల శృతిమించిన భూదోపిడీ దాహానికి ఐదుగురు తహసీల్దార్లు, ఇద్దరు వీర్వోలు బలైపోయారు. విమానాశ్రయం ఒక దశలో మరో జిల్లాకు కేటాయించే పరిస్థితి ఏర్పడింది. దగదర్తి మండలం దామవరంలో విమానాశ్రయం నిర్మించేదుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియలో అప్పటి అధికార టీడీపీ నాయకులు సాగించిన దాష్టీకం ఇప్పటికీ పచ్చి పుండుగానే ఉంది. అప్పట్లో కావలి ఆర్డీఓగా విధులు నిర్వహించిన ఎం.లక్ష్మీనరసింహ అక్రమాల్లో పాలుపంచుకున్నారని స్వయంగా జిల్లా అధికారులే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించిన పరిస్థితి.

రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్చేసి.. భూములు కాజేసి..

విమానాశ్రయం నిర్మించ తలపెట్టిన దామవరం వద్ద ప్రభుత్వ భూములు వేలాది ఎకరాలు ఉన్నాయి. ఈ భూములతో పాటు ప్రైవేట్ భూములను భూసేకరణ ప్రక్రియ ద్వారా భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించి స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. విమానాశ్రయ ప్రతిపాదిత ప్రాంతం ప్రభుత్వ భూములు కావడంతో భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన వివరాలు ఎవరి వద్ద పూర్తిస్థాయిలో లేవు. ఈ క్రమంలో తొలుత 2,200 ఎకరాల్లో విమానాశ్రయాన్ని నిర్మించాలని 'ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అధికార టీడీపీ నాయకుల దుకాణం తెరవడం వల్ల భూ వివాదాలు ఎక్కువ కావడంతో విస్తీర్ణాన్ని 1379.71 ఎకరాలకు కుదించేశారు. అయినప్పటికీ అధికార టీడీపీ నాయకులు వదిలి పెట్టలేదు. ఎకరాకు రూ.13 లక్షలు, రూ.18 లక్షలు చొప్పున రెండు రకాలు ధరలను నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించడంతో అధికార టీడీపీ దుకాణం పచ్చగా విరాజిల్లింది. టీడీపీ నేతలను ఆశ్రయించిన వారికి మాత్రమే భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన రికార్డులు రెవెన్యూ అధికారులు పుట్టించేలా ఏర్పాట్లు చేశారు.

రెవెన్యూ కార్యాలయం అడ్డాగా వాటాల పంపకం

టీడీపీ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దగదర్తి తహసీల్దార్ కార్యాలయాన్నే అక్రమాలకు అడ్డగా చేసుకుని విమానాశ్రయం కోసం జరుగుతున్న భూసేకరణలో టీడీపీ నాయకులు తలమునకలై పోయారు. వీరికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు వరుస పెట్టి సస్పెండ్ అయిపోతున్నా టీడీపీ నాయకులు చలించలేదు. వారికి రెవెన్యూ అధికారులు సహకరించడం ఆగలేదు. అందుకే భూసేకరణ ప్రక్రియ ఇప్పటికీ ముగియలేదు. ఈ క్రమంలోనే అప్పటి కలెక్టర్ రేవు ముత్యాలురాజు ఆదేశాల మేరకు రికార్డులు తారుమారు చేసిన కొన్ని అంశాలపై అప్పటి కావలి సబ్ కలెక్టర్ చామకూరు శ్రీధర్ నిజాయితీగా విచారణ చేశారు.

కావలి రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారుల నుంచి దగదర్తి తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు వరకు టీడీపీ నాయకులతో ముందస్తు ఒప్పందాలు చేసుకుని ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంలో నీకంత.. నాకింత అన్నట్లుగా వాటాలు పంచుకున్నారు. ఆత్మాభిమానం ఉన్న వారు, రికార్డులు సమగ్రంగా ఉన్న వారు మాత్రం టీడీపీ నేతల వద్దకు వెళ్లడానికి ఇష్టపడలేదు. తమ భూములకు ఇతరులకు యాజమాన్య హక్కులను ఎలా కల్పించరో అంటూ రెవెన్యూ అధికారులపై పోరాటాలు చేశారు. హక్కుల కల్పించే విషయంలో టీడీపీ నాయకులు చెప్పినట్లుగా రెవెన్యూ అధికారులు చేయడం వల్లనే రెవెన్యూ అధికారులు ఈ అక్రమాలు ఉచ్చులో చిక్కుకున్నారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయలు పేదల నుంచి టీడీపీ నాయకులు వసూళ్లు చేశారు. ఫలితంగా దగదర్తి తహసీల్దార్‌గా పనిచేసిన మీనకుమార్ సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత బషీర్, లీలమ్మ, పెంచలయ్య, జయప్రకాష్ తదితర తహసీల్దార్లు కూడా టీడీపీ ఉచ్చులో పడి ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. దామవరం వీఆర్వోగా పనిచేసిన వెంకటేశ్వర్లుతో పాటు మరో వీఆర్వో కూడా సస్పెండ్ అయ్యారు.



దిష్టిబొమ్మలా నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు శిలాఫలకం

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



డ్రైనేజీ కాలువ పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల: చేజర్ల పంచాయతీ ఎస్టీ కాలనీలో గ్రామ పంచాయతీ నిధులతో డ్రైనేజీ కాలువ పనులను ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ నిధులు ఎస్టీ, ఎస్సీ కాలనీలు అభివృద్ధికి ఖర్చు చేస్తూ, కాలనీల అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసి గ్రామాన్ని ఆదర్శవంతగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు వంగవరపు ఆనంద్‌రెడ్డి, ఏ వీరాస్వామి, నరసింహ ఆత్మకూరు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ మహమ్మద్ రఫీ ఉన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని చాకలికొండ పశువైద్య కేంద్రం సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు నిర్వహించారు. పశువులకు గొంతువాపు టీకాలు వేశారు. పశుపోషణతో అధిక లాభాలు పొందడం, పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు మహేష్, హజరత్తయ్య, కృష్ణ, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సొమ్ము మళ్లింపుపై మహిళల ఆందోళన



పొదుపు నిధులు దారి మళ్లించారని ఆరోపిస్తూ మర్రిపాడులో మాట్లాడుతున్న చిలకపాడు గ్రామం ధనలక్ష్మి పొదుపు సంఘం మహిళలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం చిలకపాడుకు చెందిన ధనలక్ష్మి మహిళా పొదుపు సంఘం గ్రూపు సభ్యులు 12 మంది నుంచి 2022 జనవరి 21న తమకు తెలియకుండా రూ.36 వేల సొమ్మును గృహ నిర్మాణశాఖకు చెందిన ఓటీఎస్ అకౌంట్‌కు వీఓఏ సౌజన్య బదిలీ చేయించారని ఆరోపిస్తూ సంబంధిత పొదుపు సంఘం మహిళలు సోమవారం వెలుగు ఏపీఎం బుజ్జమ్మను కలిసి వాపోయారు. దీంతో మండల జేసీఎస్ కన్వీనర్, చిలకపాడు గ్రామ నాయకుడు సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, వెలుగు ఏపీఎం సంయుక్తంగా నిధుల మళ్లింపు రికార్డులను పరిశీలించారు. ఏడాదిన్నర క్రితం జరిగిన ఈ వ్యవహారంపై పొదుపు సొమ్ము తాను దుర్వినియోగం చేయలేదని వారి ఖాతా నుంచి ఓటీఎస్ అకౌంట్‌కు బదిలీ చేసినట్లు రశీదు ఉందని వీఓఏ సౌజన్య వివరించారు. చివరికి ఇకపై సభ్యులకు తెలియకుండా వారి పొదుపు సంఘం అకౌంట్‌లోని నిధులు వినియోగించకూడదని చెప్పడంతో వివాదానికి తెరపడింది.

అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతాం



డాక్టర్ నాగాంజనేయులును సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఇంజినీరింగ్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ దృష్ట్యా వారిని అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె వేణుగోపాల్ అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో తొలి ఏడాది విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రామ్ సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో విద్యార్థులను ఖర్చులు కోర్చి ఇంజినీరింగ్‌లో చేర్పిస్తారని వారి ఆశలు నెరవేరేలా విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. మిజోరం రాష్ట్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ నాగాంజనేయులు మాట్లాడుతూ ఇంజినీరింగ్‌కు సంబంధించి పలువురు ఇంజనీరింగ్ ప్రముఖులు సాధించిన విజయాలను వివరించారు. విద్యార్థులు అన్ని తెలుసుకోవాలనే ఆసక్తితో విద్యను అభ్యసిస్తే విజయం సాధిస్తారన్నారు. డాక్టర్ నాగాంజనేయులను కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ కిషోర్ కుమార్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రామచంద్రారెడ్డి



రామచంద్రారెడ్డి



రామసుబ్బయ్య

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం మోటుచింతలపాళెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. నెల్లూరులో మంగళవారం జరిగే గురపౌర్ణమి దినోత్సవ వేడుకల్లో ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు. రామచంద్రారెడ్డి జిల్లా ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

రామసుబ్బయ్య..

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం సింగనపల్లి ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూనె రామసుబ్బయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. విధి నిర్వహణలో నిబద్ధత, పాఠ్యాంశాల బోధనలో సైతం రామసుబ్బయ్య ప్రత్యేకతను చాటుకున్నారు. రామసుబ్బయ్యకు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకుడు సింగనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పాలా రవీంద్రారెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

ఆత్మకూరు: ఈ ఏడాది ఆత్మకూరు నుంచి మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఆత్మకూరు మండలం పేరారెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయుడు ఎం.జయరాములు, వెన్నవాడ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు కె రవీంద్రకుమార్, ఆత్మకూరుకు చెందిన ఎస్కే అహమ్మద్ బాషా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆత్మకూరు పట్టణంలోని ఏపీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్కే నహీన్ సిరాజ్ అవార్డుకు ఎంపికయ్యా రు. ఈ మేరకు డీఈఓ కార్యాలయం నుంచి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి.

మాదకద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు

- ఎస్ఈబీ సీఐ బాలకృష్ణ



మాట్లాడుతున్న సెబ్ సీఐ బాలకృష్ణ

ఇందుకూరుపేట : మాదకద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఎస్ఈబీ సీఐ బాలకృష్ణ తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఇందుకూరుపేటలోని ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటి పట్ల యువతలో చైతన్యం తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత స్థాయిలో రాణించాల్సిన యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.జనార్దన్, మహిళా పోలీసు ఎస్.రేష్మితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకులపై కేసు నమోదు

కావలి: కావలి మున్సిపాలిటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కమిషనర్‌ను విధులకు ఆటంకపరిచారని జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్‌తో పాటు 17 మంది జనసేన నాయకులపై కావలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఈ మేరకు కావలి వన్ టౌన్ సీఐ కె.శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులకు స్థలాలివ్వాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందించి విన్నవిస్తున్న ఎంపీటీసీ పాముల రమణయ్య

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పంచాయతీలో అర్హులైన వారికి ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య సోమవారం స్పందనలో తహసీల్దార్ జగదీష్‌బాబుకు వినతిపత్రం అందించి విన్నవించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సర్వే నంబరు 173–2–3సీలో సుమారు 47 మందికి తొలి విడతలతో ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేసి ఉన్నారన్నారు. ఇంకా గ్రామంలో అర్హులు సుమారు 50 మంది వరకు ఉన్నారన్నారు. అదే సర్వే నంబరులోని ఖాళీగా ఉన్న స్థలానికి లేఅవుట్ వేసి ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. స్పందించిన తహసీల్దార్ అర్హులైన వారి జాబితా తయారు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లుకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎస్ఏ గఫూర్, బాషా, ఆర్. తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు వినతులు



అనంతసాగరంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అర్జీదారులు

చేజర్ల: చేజర్లలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మూడు వినతులు వచ్చాయని ఆర్ఐ సుమతి సోమవారం తెలిపారు. ఐకేపీ కార్యాయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాముడూరుకు చెందిన ఏ చిన్నయ్య భూ సమస్య పరిష్కారం కోసం, అదే గ్రామానికి చెందిన కే రమణయ్య భూ సమస్యపై సమాచార హక్కు చట్టం వివరాలు తెలపాలని అర్జీలు ఇచ్చారని అన్నారు. పుట్టుపల్లి చెందిన వ్యక్తి రెవెన్యూ రికార్డుల్లో తన పేరును మార్చాలని అర్జీ ఇచ్చారని తెలిపారు.

అనంతసాగరంలో

అనంతసాగరం మండలం అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ప్రదీప్ తెలిపారు. పాస్ బుక్ కావాలని ఒకటి, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఎం నాయకులు ఒకటి, హైవే–67 పరిహారం పెంచాలని ఒకటి వచ్చినట్లు ఆయన తెలిపారు.

మున్నెళ్లికి పుడమి సాహితి వేదిక పురస్కారం



మున్నెళ్లి శివశంకరయ్యకు పుడమి సాహితివేదిక జాతీయ పురస్కారం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన పుడమి సాహితి వేదిక మర్రిపాడు మండలం చుంచులూరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మున్నెళ్లి శివశంకరయ్యకు సోమవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారాన్ని అందజేశారు. పాఠ్యాంశాల బోధనలో ప్రతిభ చూపినందుకుగా ఈ పురస్కారం తనకు అందజేశారని శివశంకరయ్య తెలిపారు. వ్యవహారిక భాషాపితామహుడు గిడుగు రామమూర్తి అవార్డులు కూడా వారి ముని మనుమడు గిడుగు వెంకట నాగేశ్వరరావు తనకు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనాథ మహాకవి వారసులు డాక్టర్ కావూరి శ్రీనివాసశర్మ, భద్రాచల భక్త రామదాసు వారసుడు కంచర్ల శ్రీనివాస్, పుడమి సాహితివేదిక పెద్దలు డాక్టర్ బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిమలూరు ఉప సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక



హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉపసర్పంచ్‌గా ఎన్నికైన పంది మాధవకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో సోమవారం ఉప సర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించగా వార్డు మెంబర్ మోరంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి ఆత్మకూరు ఈఓపీఆర్డీ ఉషారాణి ఆధ్వర్యంలో ఉప ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, మహిమలూరుకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నలగర్ల మస్తానయ్య, నాగేశ్వరరావు, ఇందుకూరు పవన్, హజరత్తయ్య, ఎం.లింగారెడ్డి, మోరంరెడ్డి సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వేములపాడు ఉపసర్పంచ్‌గా మాధవ

జలదంకి: మండలంలోని వేములపాడు పంచాయతీ ఉప సర్పంచ్‌గా 4వ వార్డు మెంబరు పంది మాధవను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. సోమవారం ఎన్నికల అధికారి, ఎంపీడీఓ శ్రీధర్ బాబు వేములపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపసర్పంచ్ ఎన్నిక చేపట్టారు. వేములపాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు టకోల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇటీవల వేములపాడు పంచాయతీ ఉప ఎన్నికల్లో 4, 7 వార్డులను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారన్నారు. ఈ మేరకు పంది మాధవను ఉపసర్పంచ్‌గా ఎన్నిక చేశామని తెలిపారు.

వేల్పులగుంట ఉపసర్పంచ్ ఎన్నిక

అనుమసముద్రంపేట: మండలంలోని వేల్పులగుంట ఉప సర్పంచ్‌గా మండల లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల లక్ష్మి పంచాయతీలో రెండో వార్డు సభ్యురాలుగా ఉన్నారు. సోమవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఓ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ ఎన్నిక జరిగింది. ఏకగ్రీంగా ఎన్నికైన మండల లక్ష్మికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

కొత్త పింఛన్ల పంపిణీ



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న చిలకపాడు సర్పంచ్ సిద్ధంరెడ్డి రమాదేవి



కావలిలో మూర్తిశెట్టివారివీధిలో వృద్ధురాలు శీలం పద్మావతికి వృద్ధాప్య పింఛన్ నగదు అందజేస్తున్న గణపవరపు అనూష

కావలి: కావలి పట్టణంలో కొత్తగా 241 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా ప్రత్యేకంగా పింఛన్లు అందించినట్లు మున్సిల్ కమిషనర్ ఇ.కిరణ్ సోమవారం చెప్పారు.

చిలకపాడులో..

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని చిలకపాడులో కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక సర్పంచ్ సిద్ధంరెడ్డి రమాదేవి వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ నాయకుల కృషితో తమ గ్రామానికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని కృతజ్ఞతలు తెలిపారు.

చేజర్లకు కొత్తగా 231 పింఛన్లు

చేజర్ల: మండలానికి సంబంధించి నూతనంగా 231 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఎస్కే కరిముల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పింఛన్లు ప్రజా ప్రతినిధులతో కలిసి ఈ నెల 7వ తేదీ లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు